


**అసంపూర్తి డబల్ బెడ్రూమ్ ఇళ్లపై సిపిఐ ఆగ్రహం**


# ప్రజాపక్షం

## జిల్లా అనుబంధం

నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

శనివారం | 11 ఏప్రిల్ , 2026 | పేజీలు : 05


# రోడ్డు భద్రత చర్యల్లో భాగస్వామ్యం కావాలి

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : అరైవ్ అలైవ్ అనేది రోడ్డు భద్రత అవగాహన ఉద్యమమని దీనిలో అన్ని శాఖల అధికారులు బాధ్యత తీసుకుని రోడ్డు భద్రత చర్యల్లో భాగస్వామ్యం అవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని విసి హాల్ నందు జిల్లాలోని ఆర్‌డిఓలు, తహశీల్దార్లు, ఎంపిడిఓలు, మున్సిపల్ కమీషనర్లు, నేషనల్ హైవే అధికారులు, ఆర్ అండ్ బి, రైల్వే అధికారులు, ఇరిగేషన్, ఆర్‌టిఓ, ఎడ్యుకేషన్, డిఎంహెచ్‌ఓ, పోలీసు అధికారులు, జిల్లా అధికారులతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈనెల 13 నుండి 18 వరకు నిర్వహించనున్న అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం సంబంధించి జిల్లా అధికారులతో ఆయన ఎస్పి కె. నరసింహాతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరిగి ఏ ఒక్కరూ ప్రాణాలు కోల్పోకుండ ప్రజలకు అవగాహన కల్పించడానికి రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం పోలీసు శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలలో జిల్లా యంత్రాంగం బాధ్యతగా తీసుకొని ప్రజలను, విద్యార్థులను, యువతను చైతన్యవంతం చేయాలని సూచించారు. రహదారుల పైన లోపాలను గుర్తించి సవరించాలని జాతీయ రహదారుల సంస్థ అధికారులను ఆదేశించారు. గ్రామస్థాయిలో రోడ్డు భద్రత కమిటిలు ఏర్పాటు చేసి 13వ తేదీ నుండి పెద్దఎత్తున గ్రామాలలో రోడ్డు భద్రత అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. పాఠశాల, కళాశాల విద్యార్థులను భాగస్వామ్యం చేసి రోడ్డు భద్రత, రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. గ్రామీణ రోడ్ల పక్కనే ఉన్న నిరుపయోగ బావులను పూడ్చివేయాలని సూచించారు. జిల్లా ఎస్పి కె. నరసింహ మాట్లాడుతూ 13వ తేదీన అన్ని గ్రామాల్లో రోడ్డు భద్రత గ్రామ సభలు నిర్వహించాలని సూచించారు. సోషల్ మీడియా ఈవెంట్స్ నిర్వహించి రోడ్డు భద్రత పట్ల ప్రచారం చేయాలని, హెల్మెట్ లేనిదే కార్యాలయంలోకి ద్విచక్ర వాహనాలు అనుమతించవద్దని, అన్ని కార్యాలయాల వద్ద నో హెల్మెట్ నో ఎంట్రీ అని బోర్డు పెట్టాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా ప్రమాదంపై సమాచారం అందించే డయల్ 100, 112, 108ల గురించి ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, వీటితోపాటు ప్రథమ చికిత్స, గోల్డెన్ హావర్‌పై క్షేత్రస్థాయిలో ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం పోలీసు శాఖ ఆధ్వర్యంలో రూపొందించి రోడ్డుభద్రత అవగాహన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె. సీతారామారావు, అడిషనల్ డిసిపి రవీందర్ రెడ్డి, జడ్‌పి సిఇఓ శిరీష, డిఎంహెచ్‌ఓ వెంకటరమణ, డిఇఓ అశోక్, ఆర్‌టిఓ జయప్రకాష్ రెడ్డి, సిపిఓ కిషన్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**భూసేకరణ పనులు వేగవంతం చేయాలి**

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : భూసేకరణ పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లోని విసి కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లాలో వివిధ అభివృద్ధి పనులకు కావల్సిన భూసేకరణ నిమిత్తం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇరిగేషన్, రైల్వే, ఇండస్ట్రియల్ పార్క్ మొదలగు అభివృద్ధి పనులకు కావల్సిన భూమి నిమిత్తం భూసేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె. సీతారామారావు, ఆర్‌డిఓలు వేణుమాధవ్, శ్రీనివాసులు, సూర్యనారాయణ, ఇఇ, డిఇలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# వేగవంతంగా ఉపాధి పనులు

### నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** జిల్లాలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులు పెండింగ్‌లో లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అన్ని శాఖల ఇంజనీరింగ్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ భవనాలు,సీసీ రోడ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల ప్రహరీ గోడలు, ఫుడ్ స్టోరేజ్ గోదాములు, అమ్మ ఆదర్శ పాఠశాల భవనాలు,ఆర్ బి భవనాలు తదితర నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు.అన్ని ప్రభుత్వ భవనాల్లో తాగునీటి సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, హాస్టళ్లు, పాఠశాలల్లో టాయిలెట్స్, కిచెన్లు, తాగునీటి సౌకర్యాలు, ఆర్‌ఓ ప్లాంట్లు సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చిన్నపాటి మరమ్మత్తులు ఉన్నా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పూర్తి చేయాలని, పనులు నాణ్యతతో చేపట్టాలని స్పష్టం చేశారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలలో తాగునీటి సరఫరా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేలా చూడాలని, బోర్ల మరమ్మత్తులు,లీకేజీలను వెంటనే సరిచేయాలని అధికారులకు సూచించారు. నీటి సరఫరాలో సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. జిల్లా పరిషత్ సీఈఓ ప్రేమ్ కరణ్ రెడ్డి,పంచాయతీ రాజ్ ఎస్ఈ రామచంద్రారెడ్డి,ఆర్‌బి ఎస్ఈ శ్రీధర్ రెడ్డి ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు.



**సహజ వైద్యంపై అవగాహన పెంచాలి:** ఆయుర్వేద,యునాని,హోమియోపతి వంటి సహజ వైద్య విధానాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను సూచించారు.శుక్రవారం ప్రభుత్వ కేంద్ర ఆసుపత్రిలో హోమియోపతి డే సందర్భంగా ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా హోమియోపతి పితామహుడు డాక్టర్ సామ్యూల్ హానీమన్ చిత్రపటానికి నివాళులు అర్పించారు.ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ లక్ష్యమని పేర్కొంటూ,సైడ్ ఎఫక్ట్స్ తక్కువగా ఉండే ఆయుర్వేద,యునాని,హోమియోపతి వైద్య విధానాలపై అవగాహన పెంపు అవసరమన్నారు. విద్యార్థులు ఆరోగ్యకరమైన అలవాట్లు అలవర్చుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్,డిప్యూటీ డిఎంహెచ్వో వేణుగోపాల్ రెడ్డి,డాక్టర్ ముబీన్ పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.



## వేముల వీరేశం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరికలు

**ప్రజాపక్షం/నకిరేకల్** :పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ప్రభుత్వ విప్,నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సమక్షంలో కట్టంగూర్ మండలం కలిమెర గ్రామానికి చెందిన సర్పంచ్ తోటకూరి జలంధర్‌యాదయ్య,ఉప సర్పంచ్ కమ్మంపాటి యాదయ్యలింగమ్మ, వార్డ్ సభ్యులు తండు గిరిబాబు,కత్తుల యాదగిరి,మహాలక్ష్మి,పాలోజు వెంకట్ చారి తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తుందని,గ్రామాభివృద్ధికి కృషి చేసే ప్రతి ఒక్కరినీ పార్టీ స్వాగతిస్తుందని తెలిపారు.కొత్తగా చేరిన నాయకులు,ప్రజాప్రతినిధులు పార్టీ బలోపేతానికి కీలక పాత్ర పోషిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈకార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పెద్ది సుక్కయ్య పాల్గొన్నారు.

**ప్రభుత్వ విప్ వేముల వీరేశంకు సన్మానం**

నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రభుత్వ విప్‌గా నియమితులైన సందర్భంగా శుక్రవారం ఐఎన్‌టియుసి జిల్లా కార్యవర్గ సభ్యులు ఆయనను పట్టణంలోని ఆయన నివాసంలో ఘనంగా సన్మానించారు.ఈకార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు భిక్షం,ప్రధాన కార్యదర్శి వి.నరసింహ చారి, వర్కింగ్ ప్రెసిడెంట్ భారతి,జిల్లా చీఫ్ వైస్ ప్రెసిడెంట్, వై.రామ కృష్ణ,నకిరేకల్ యూనిట్ అధ్యక్షుడు జీ.కరుణాకర్ రెడ్డి,మేరీ సీనియర్ నాయకులు జమలుద్దిన,అంజయ్య,రవి,రవీందర్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన ఆర్థిక సహాయ చెక్కులను శుక్రవారం ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే వేముల వీరేశం లబ్ధిదారులకు అందజేశారు.

## జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థులకు కలెక్టర్ అభినందనలు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థులు జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొనడానికి ఎంపికయ్యారు.ఈపోటీలు 2025 నవంబర్ 26 నుంచి డిసెంబర్ 2 వరకు అరుణాచల్ ప్రదేశ్ లోని ఈటానగర్‌లో నిర్వహించబడనున్నాయి.డీపీ స్కూల్‌కు చెందిన నవ్య డొమ్మరాజు (8వ తరగతి), ఇగ్నైట్ జూనియర్ కాలేజీకి చెందిన శ్రీ సాయి ఆదిత్య (12వ తరగతి) ఈపోటీలకు ఎంపికయ్యారు. వీరికి జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి అవసరమైన సర్టిఫికెట్లు అందజేసిజిల్లా కలెక్టర్ బి.చంద్ర శేఖర్ అభినందించారు.అలాగే,పీఎం శ్రీ పాఠశాలల క్రీడా పోటీల్లో మొదటి స్థానం సాధించిన విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్సులు అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు.విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి జిల్లాకు పేరు తెచ్చేలా కృషి చేయాలని అధికారులు ఆకాంక్షించారు.కార్యక్రమంలో సంబంధిత అధికారులు, క్రీడా విభాగం ప్రతినిధులు పాల్గొన్నారు.





## గిట్టుబాటు ధర అందేలా ప్రభుత్వం చర్యలు

ప్రజాపక్షం/చివ్వెంల : రైతులు పండించిన వరి ధాన్యానికి గిట్టుబాటు ధర అందేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని వల్లభాపురం, గుంపుల గ్రామాలలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. వల్లభాపురం పరిసర గ్రామాల రైతులకు ఈ కొనుగోలు కేంద్రం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. సమయానికి ధాన్యం కొనుగోలు జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్, నాయకులు ధరావత్ వీరన్న నాయక్, చెన్నోజు నర్సింహాచారి, కాసం లింగారెడ్డి, పిట్ట రాజశేఖర్ రెడ్డి, మొగదాల లక్ష్మణ్ గౌడ్ పాల్గొన్నారు.

## చెక్కుల పంపిణీ



ప్రజాపక్షం/రామన్నపేట : యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల పరిధిలోని బోగారం గ్రామంలో ప్రభుత్వ విప్, నకిరేకల్ శాసనసభ సభ్యులు వేముల వీరేశం ఆదేశానుసారం శుక్రవారం గ్రామంలో కూనూరు రామచంద్రం, మేడి అరవింద్, చల్లమల్ల శ్రీనివాస్ రెడ్డి, చిరబోయిన శిల్ప, కూనూరు సుస్మితలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంపల రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీటీసీ గోగు పద్మ సత్తయ్య యాదవ్, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు మద్దె పురి ఐలయ్య పాల్గొన్నారు.

## ప్రజలకు చలివేంద్రాలు ఉపకరిస్తాయి

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : వేసవి కాలం దృష్ట్యా చలివేంద్రాల ఏర్పాటు ద్వారా బయటకు వచ్చిన పట్టణ ప్రజలతోపాటు వివిధ గ్రామాల నుంచి వచ్చే వారికి ఎంతో మేలు జరుగుతుందని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కోర్టు చౌరస్తాలో 28వ వార్డు కౌన్సిలర్ సంద్రపాటి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన కౌన్సిలర్‌ను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోతి గోపాల్ రెడ్డి, ధరావత్ వీరన్న నాయక్, చింతమళ్ల రమేష్, కక్కిరేణి శ్రీనివాస్, కొండపల్లి దిలీప్ రెడ్డి, కొనతం రాజేష్ రెడ్డి, అనంతుల యాదగిరి, తంగెళ్ళ కరుణాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## అర్హులైన ప్రతీ నిరుపేదకూ ఇందిరమ్మ ఇళ్లు



ప్రజాపక్షం/చివ్వెంల : ఇండ్లు లేని ప్రతి నిరుపేదకు ఇందిరమ్మ ఇండ్లు కట్టించి ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని గుంపుల గ్రామంలో మండల పార్టీ అధ్యక్షుడు ధరావత్ వీరన్న నాయక్‌తో కలిసి లబ్ధిదారు షేక్ పర్వీన్‌బేగం అబ్దుల్ హమీద్ ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. డబుల్ బెడ్‌రూం ఇండ్లు కట్టిస్తామని చెప్పి పదేండ్లు ఊరించిన గత ప్రభుత్వం ఒక్కరికైనా పక్కా ఇల్లు ఇవ్వలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో ప్రతి నియోజక వర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసిందని గుర్తు చేశారు. ప్రతి ఏడాది నియోజక వర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్ల చొప్పున మంజూరు చేసి ప్రతి పేదవాడికి పక్కా ఇల్లు నిర్మించి ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాసం లింగారెడ్డి, పిట్ట రాజశేఖర్ రెడ్డి, ఆవుల నాగయ్య, కిన్నెర శ్రీను, సైదిరెడ్డి, వీరయ్య, ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుకు దరఖాస్తులు

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : అనాథ, పాక్షిక అనాథ, నిరుపేద, తల్లిదండ్రుల నిర్లక్ష్యానికి గురైన, అక్రమ రవాణాకు గురైన బాధిత బాలికల కొరకు ఎటువంటి అర్హత పరీక్ష లేకుండా నేరుగా దుర్గాబాయి దేశ్‌ముఖ్ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల హైదరాబాద్ నందు 202627 సంవత్సరమునకు సంబంధించి అడ్మిషన్లు కొరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి, మహిళా, శిశు, వికలాంగుల, వయోవృద్ధుల శాఖల అధికారి కె. నరసింహారావు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఇట్టి కోర్సుల నందు చేరదానికి, ప్రస్తుత విద్యా సంవత్సరములో 10వ తరగతి పూర్తి చేసినటువంటి ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. తల్లి దండ్రుల మరణ ధృవీకరణ పత్రం (అనాథ బాలిక అయినట్లయితే), కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు (అనాథ బాలికలకు అవసరం లేదు), స్టడి సర్టిఫికెట్, బోనఫైడ్ సర్టిఫికెట్, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు (2), ఎస్ఎస్‌సి హాల్ టికెట్ జతచేసి దరఖాస్తు చేసుకోవాలని వివరించారు. తేది.23.05. 2026 సాయంత్రం 500 గంటల లోపు దరఖాస్తు చేసుకొనవలెనని, మరింత సమాచారం కొరకు 7901690381, 7901690382, 79016903 83ను సంప్రదించాలని కోరారు.

## ప్రహరి గోడ లేకపోవడంతో విద్యార్థుల భయబ్రాంతులు



### ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాథుడే లేడా?

ప్రజాపక్షం/నేరేడుగొమ్ము; నల్లొండ జిల్లా నేరేడు గొమ్ము మండల కేంద్రంలోని స్థానిక ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాల ప్రహరీ గోడను రోడ్డు విస్తరణలో భాగంగా తొలగించడం జరిగింది. తొలగించిన ప్రహరీ గోడను నేటికి నిర్మించకపోవడంతో ఆశ్రమ పాఠశాల విద్యార్థులు రాత్రి అయితే భయబ్రాంతులకు గురవుతూ ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రహరీ లేకపోవడంతో పాఠశాలలోపలికి రాత్రి సమయాల్లో మందు బాబులు, ఆకతాయిలు రావడం జరుగుతుందని దీనికి తోడుగా కుక్కలు, పందులు, పశువులు పాఠశాల ఆవరణలో సంచరిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. ఆశ్రమ పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని హాస్టల్ వార్డెన్ ఎన్ని సార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలకు ప్రహరీ గోడ నిర్మించాలని కోరారు.

## రూ.20లక్షల వ్యయంతో నూతన గ్రామ పంచాయతీ భవనం ప్రారంభం

### మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

ప్రజాపక్షం/చండూరు / గట్టుప్పల: రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో మునుగోడు నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నానని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మునుగోడు నియోజకవర్గంలోని గట్టుప్పల మండలంలోని కమ్మగూడెం గ్రామంలో 20లక్షల వ్యయంతో నిర్మించిన నూతన గ్రామ పంచాయితీ భవనాన్ని ప్రారంభించారు. తేరటుపల్లి గ్రామంలో నిరుపేద మహిళ ఆకుల పద్మ నూతన ఇందిరమ్మ గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కమ్మగూడెంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మాజీ సర్పంచ్ గోలి లూర్దమ్మ నివాసానికి వెళ్లి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుమారుడు ప్రసాద్ తోపాటు వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. గట్టుప్పల మండల కేంద్రంలో చేనేత రుణమాఫీ ,నేతన్నల బీమ పథకం కింద మంజూరైన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ నా చిన్ననాటి నుండి చేనేత కార్మికుల సమస్యలపై నాకు మంచి అవగాన ఉందని అన్నారు. టెక్నాలజీ పెరిగి మరమగ్గాలు వచ్చిన తర్వాత నేతన్నలకు కష్టాలు పెరిగాయని అన్నారు. నాగరిక ప్రపంచంలో ప్రజల ఆత్మ గౌరవాన్ని నిలబెట్టిన ఘనత నేతన్నదే అని అన్నారు. అనంతరం నేతన్నల బీమా పథకం కింద ఏడుగురు వ్యక్తులకు 35లక్షల విలువ చేసే చెక్కులు , చేనేత రుణమాఫీ కింద 141 మంది నేతన్నలకు 1కోటి 10లక్షల 75వేల రూపాయల చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గట్టుప్పల తహసీల్దార్ రాములు , డిసిసిబి మాజీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, చండూరు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు , మున్సిపల్ వైస్ చైర్మన్ భూతరాజు దశరథ , గట్టుప్పల సర్పంచ్ నామని జగన్నాథం , తేరటపల్లి సర్పంచ్ సింగం వెంకటేశం , కమ్మగూడెం సర్పంచ్ , తేరటపల్లి మాజీ సర్పంచ్ వీరమళ్ళ శ్రీశైలం పాల్గొన్నారు.





## చేనేత రుణమాఫీ, నేతన్న భరోసా నేతన్న బీమా చెక్కుల పంపిణీ

ప్రజాపక్షం/భువనగిరి : చేనేత కార్మికులకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన చేనేత రుణమాఫీ, నేతన్న భరోసా మరియు నేతన్న బీమా చెక్కులను ప్రభుత్వ విప్, నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం, భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి చేతుల మీదుగా శుక్రవారం భువనగిరిలోని లింగ బసవ గార్డెన్ చేనేత కార్మికులకు అందజేశారు. చేనేత రుణమాఫీ పథకం కింద రూ.19.24 కోట్లు, చేనేత భరోసా పథకం కింద రూ.3.29 కోట్లు మరియు నేతన్న బీమా పథకం కింద రూ.2.40 కోట్ల నిధులను యాదాద్రి భువనగిరి జిల్లాలోని చేనేత కార్మికులకు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవేస్ చిస్తి, పోచంపల్లి మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశం, అడిషనల్ కలెక్టర్ స్థానిక సంస్థలు భాస్కర రావు, అడిషనల్ కలెక్టర్ రెవిన్యూ వెంక రెడ్డి, రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ పద్మ, సహాయ సంచాలకులు చేనేత జౌళి శాఖ శ్రీనివాసరావు, కార్యాలయ సిబ్బంది మరియు చేనేత కార్మికులు పాల్గొన్నారు.

## పురుషోత్తంరెడ్డి సేవలు మరువలేనివి

ప్రజాపక్షం/రామన్నపేట : రామన్నపేట నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన నాయకులలో పురుషోత్తంరెడ్డి ఒకరు రామన్నపేట నియోజకవర్గ సాధన సమితి ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు గత సంవత్సరం నుంచి చేస్తూ వస్తున్నాం పురుషోత్తం రెడ్డి చరిత్రను తెలుసుకోవడం చాలా గొప్ప విషయమని రామన్నపేట సాధన సమితి గౌరవ అధ్యక్షులు, పల్లివాడ గ్రామ సర్పంచ్ కంభంపాటి శ్రీనివాస్ గౌడ్ పత్రికా ప్రకటనలో తెలిపారు. ఉప్పునూతల పురుషోత్తం రెడ్డి యాదాద్రి జిల్లా అడ్డగూడూరు గ్రామంలో 1933లో జన్మించారు. మొదటిసారిగా అడ్డగూడూరు సర్పంచిగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించి, రెండుసార్లు శాసనసభ్యునిగా రెండుసార్లు శాసనమండలి సభ్యునిగా ఎన్నికైనారు. డైరీ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఏపీసీసీ చైర్మన్‌గా తెలంగాణ ప్రాంతీయ అభివృద్ధి మండలి చైర్మన్‌గా పని చేశారు. 1947లో కాంగ్రెస్ పార్టీలో చేరి హైదరాబాద్ రాష్ట్ర విమోచన ఉద్యమంలో నిజాంకు వ్యతిరేకంగా పోరాటం చేశారు. 1957 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్‌లో స్నేహపూరిత వాతావరణ కొరకు మంచి సందేశం పేరిట యాత్ర నిర్వహించినారు. 1969లో ఎమ్మెల్సీగా ఎన్నికై 1969 నుంచి 1972 వరకు రామన్నపేట నియోజకవర్గానికి చెందిన ఇతను చిన్ననీటి వనరుల శాఖ మంత్రిగా పని చేసి 1974 నుంచి 1977 వరకు అప్కారి గనుల శాఖ మంత్రిగా పనిచేశారు.

## శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాపక్షం/మునగాల : వైద్య ఆరోగ్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ డాక్టర్ వేమూరి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మండలంలోని నర్సింహాపురం గ్రామ పంచాయితీ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న 99రోజులపాటు జరిగే కార్యక్రమంలో భాగంగా ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం సందర్భంగా మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అసంక్రమిత వ్యాధుల నిర్ధారణ వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సుమారు 150 మందికి వివిధ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పచ్చిపాల అశ్విని, రేవూరి కళ్యాణి బాబు, కేసగాని కామేశ్వరి వెంకన్న, పంచాయితీ కార్యదర్శి పచ్చిపాల వెంకటేశ్వర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



## పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనం చోరీ

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** దుకాణం ముందు పార్కింగ్ చేసిన షేక్ మగ్బుల్‌కు చెందిన టిఎస్05ఎఫ్‌ఎన్1709 ద్విచక్ర వాహనం గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు గురువారం అర్ధరాత్రి దొంగతనం చేశారు. పట్టణానికి చెందిన షేక్ మగ్బుల్ క్రాంతి మొబైల్ దుకాణంలో పనిచేస్తున్నాడు. మగ్బుల్ యొక్క ద్విచక్ర వాహనంను షాప్ ముందు ఉంచి ఇంటికి వెళ్ళగా గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు తీసుకువెళ్ళారని అన్నారు. తెల్లవారుజామున వచ్చి చూసే సరికి వాహనం కనిపించలేదని అన్నారు. బాదితుడు షేక్ మగ్బుల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అజ్మీరా రమేష్ తెలిపారు.

## కొనుగోలు కేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/చిట్యాలః** నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటి కేంద్రంలోని 6వ వార్డు పరిధిలో గల వెంకటాపురంలో ధాన్యం కొనుగోలు నూతన కేంద్రాన్ని స్థానిక మార్కెట్ కమిటి చైర్మన్ నర్రా వినోదమోహన్‌రెడ్డి శుక్రవారం రోజున ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ప్రాంత రైతుల ఇబ్బందులను తొలగించేందుకు వెంకటాపురం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖ ద్వారా అన్ని అసౌకర్యాలను రైతులకు అందజేస్తామని ఈ సందర్భంగా ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గుండెబోయిన శ్రీలక్ష్మి సైదులు, కౌన్సిలర్లు జెర్రిపోతుల సత్యనారాయణ, కోనేటి ఎల్లయ్య పాల్గొన్నారు.

## తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు

**ప్రజాపక్షం/రామన్నపేట** : యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం బోగారం గ్రామానికి చెందిన దోర్నాల రాములు అకాల మృతిచెందగా ఆయనకు నలుగురు కూతుర్లు ఉండగా పెద్ద కూతురు రమాదేవి తండ్రికి తలకొరివి పెట్టి పలువురిని కంటతడి పెట్టించింది.రెండవ కూతురు రజిని మూడవ కూతురు విజయ,నాలుగవ కూతురు కల్పన మొత్తం నలుగురు కూతుర్లు తండ్రి మరణంతో తనయురాలు తలకొరివి పెడుతుంటే గ్రామస్తులు కంటతడి పెట్టారు,కంటే కూతుర్నే కనాలి రా అన్న విధంగా పలువురిని ఆలోచింపజేశారు. ఏది ఏమైనా కూతురు తల కొరివి పెట్టడం ఒక విశేషం ఈ యొక్క దహన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కూనూరు సాయికుమార్ గౌడ్, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## మోయలేని ఫీజుల భారం -ఆగని ప్రైవేటు దోపిడీ

### చోద్యం చూస్తున్న ప్రభుత్వం




**ప్రజాపక్షం/రామన్నపేట** : విద్య పేదలకు అందని ద్రాక్షగా మారుతోంది. ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ విద్యా రంగంలో పెద్ద మార్పులు కనిపించడం లేదు. స్కూల్ నుండి కాలేజీ వరకు ఫీజులు భారీగా పెరగడంతో పేద కుటుంబాలు తమ పిల్లలకు చదువు అందించలేని పరిస్థితి ఏర్పడింది. ప్రైవేట్ పాఠశాలలు, కాలేజీలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ వాటిపై సరైన నియంత్రణ లేదు. చిన్న తరగతులకే లక్షల రూపాయల ఫీజులు ఉండగా, ఇంజనీరింగ్ వంటి ఉన్నత విద్యకు సంవత్సరానికి లక్షల్లో ఖర్చవుతోంది. దీంతో పేద విద్యార్థులు చదువు నుంచి దూరమవుతున్నారు. ఫీజులు తగ్గించాలని తల్లిదండ్రులు నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. గతంలో కమిటీలు ఏర్పాటు చేసి ఫీజులు నియంత్రిస్తామని చెప్పినా, అమలు పూర్తిగా జరగలేదు. తాజాగా కూడా ప్రభుత్వం ఫీజుల నియంత్రణపై హామీలు ఇచ్చినా ఇంకా స్పష్టమైన చర్యలు తీసుకోలేదు. కొత్త విద్యా సంవత్సరం దగ్గరపడుతున్నప్పటికీ ఫీజుల సమస్య అలాగే కొనసాగుతోంది. పేదలకు అందుబాటులో ఉండేలా విద్యను తక్కువ ఖర్చుతో లేదా ఉచితంగా అందించాల్సిన అవసరం ఉంది. ఇందుకు సంబంధించి చట్టాలు ఉన్నా, అమలుకు నోచుకోవడం లేదు. విద్య అందితే ఒక కుటుంబం మాత్రమే కాదు, ఒక తరం మారుతుంది. అందుకే ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకుని పేద విద్యార్థులకు విద్య అందేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

## రామన్నపేట నియోజకవర్గాన్ని పునరుద్ధరించాలని అఖిలపక్షాల సమావేశం



**ప్రజాపక్షం/రామన్నపేట** : గతంలో రద్దయిన రామన్నపేట నియోజకవర్గం పునరుద్ధరించాలని నియోజకవర్గాల పునర్విభజనలో రామన్నపేటకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని మండల అఖిలపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. కాంగ్రెస్, సిపిఎం, బీజేపీ, బిఆర్‌ఎస్ పార్టీల ఆధ్వర్యంలో స్థానిక రహదారి బంగళాలో అఖిలపక్ష పార్టీల సమావేశం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సింగిరెడ్డి మండలారెడ్డి అధ్యక్షతన నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జల్లెల పెంటయ్య,కాంగ్రెస్ జిల్లా నాయకుడు గంగుల రాజిరెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు బండ మధుకర్ రెడ్డి,బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోచబోయిన మల్లేశం మాట్లాడుతూ సుమారుగా 50 సంవత్సరాలు కొనసాగిన రామన్నపేట నియోజకవర్గం 2009వ సంవత్సరంలో రద్దు చేయడంతో 20 సంవత్సరాలు వెనక్కి పోవడం జరిగిందని, మండల కేంద్రమైన రామన్నపేటలో డివిజనల్ స్థాయి ప్రభుత్వ కార్యాలయాలు అన్ని కూడా అందుబాటులో ఉన్నాయని, నియోజకవర్గ కావడానికి ఉన్న సదుపాయాలు ఇప్పటికే ఉన్నాయన్నారు.నియోజకవర్గాన్ని పునరుద్ధరించడం న్యాయమైన డిమాండ్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా నాయకులు కన్నెకంటి వెంకటేశ్వర చారి,టిపిసిసి అధికార ప్రతినిధి మేడి రవిచంద్ర, సిపిఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, టిఆర్ఎస్ మండల నాయకులు బత్తుల వెంకటేశం,బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎండి మజీద్, కార్యదర్శి యాదాసు యాదయ్య,జినుకల ప్రభాకర్,సాల్వేరు అశోక్,కూరెళ్ళ నర్సింహా చారి,ఎండీ జమీరొద్దీన్, గోదాసు పృద్వి పాల్గొన్నారు.

## ఈ నెల 13 నుంచి 'అరైవ్ -అలైవ్' రోడ్డు భద్రత వారోత్సవాలు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ప్రజా పాలన,ప్రగతి ప్రణాళికలో భాగంగా అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత ప్రత్యేక వారోత్సవ కార్యక్రమాలు ఈ నెల13 నుండి18 వరకు నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ తెలిపారు.శుక్రవారం నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా ఎస్పి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ,ట్రాఫిక్ నియమాల అమలు ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపు లక్ష్యంగా అన్ని శాఖల అధికారులు,ప్రజాప్రతినిధులు, విద్యార్థులు,డ్రైవర్ సంఘాలు మరియు స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా పాఠశాలల్లో విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించడం, హెల్మెట్ సీట్‌బెల్ట్ వినియోగంపై ప్రచారం నిర్వహించడం జరుగుతుందన్నారు.అదేవిధంగా ఆటో,బస్, టాక్సీ, స్కూల్ బస్ డ్రైవర్లపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించడం,డ్రైవర్లకు కంటి చూపు పరీక్షలు,డ్రైవింగ్ లైసెన్స్ వాహన పత్రాల తనిఖీలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. రోడ్డు ప్రమాదాల సమయంలో అత్యవసర స్పందనపై గోల్డెన్ అవర్ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి,పోలీస్ సిబ్బంది,అంబులెన్స్ డ్రైవర్లు వాలంటీర్లకు ఫస్ట్ ఎయిడ్ పై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

## బండకొత్తపల్లి గ్రామంలో మెగా హెల్త్ క్యాంపు



**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం బండకొత్తపల్లి గ్రామంలో శుక్రవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మండల వైద్యాధికారి డా. ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా హెల్త్ క్యాంపును గ్రామ సర్పంచ్ గద్వాల ఉపేందర్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. గ్రామంలోని ప్రజలకు ఉచితంగా రక్త పరీక్షలు, బిపి, షుగర్, కంటి పరీక్షలను నిర్వహించి అవసరం అయిన వారికి ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గోపాలదాస్ యాదగిరి, వార్డు సభ్యులు, వైద్య సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## పరిశ్రమ అనుమతులను రద్దు చేయాలి

**ప్రజాపక్షం/చిట్యాలః** నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పిట్టంపల్లి గ్రామంలో నెలకొని ఉన్న నోస్ ఫార్మాసిటికల్ ల్యాబ్ పరిశ్రమ అనుమతులను రద్దు చేయాలని తెలంగాణ ఉద్యమ నేత, రాష్ట్ర ఉద్యమకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కూనూరు సంజయ్ దాస్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పరిశ్రమలో జరిగిన సంఘటనలో గాయపడిన ఉద్యోగులకు మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరిశ్రమ కారణంగా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాద విషయం తెలుసుకుని వెంటనే స్పందించిన ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశంకు సంజయ్ దాస్ కృతజ్ఞతలు తెలియజేశారు.

## భానుడు భగభగ



**ప్రజాపక్షం/నేరేడుచర్ల** : వేసవి కాలం ఏప్రిల్ నెలలోనే భానుడు భగభగమంటున్నాడు. ఎండ తీవ్రతను తట్టుకోలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం నేరేడుచర్ల పట్టణంలో కొంతమంది చిన్నారులు ఎండవేడి తట్టుకోలేక కాలువలో ఈత కొడుతూ సేద తీరారు. తీవ్రమైన ఎండ ప్రభావంతో మధ్యాహ్న సమయంలో రోడ్లన్నీ ఖాళీగా దర్శనమిచ్చాయి. భగభగలాడే భానుడిని చూసి ప్రజలు భయపడుతున్నారు. ఇంకా కొన్ని చోట్ల వరి కోతలు మిగిలి ఉన్నాయి. ఎండలు చూసి రైతులు సైతం జంకుతున్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా ఎండల తీవ్రతను చూసి కార్మికులు కూడా బెంబేలెత్తిపోతున్నారు. తీవ్రమైన ఎండల నేపథ్యంలో వీలైనంత వరకు మధ్యాహ్న సమయంలో బయటికి రాకుండా, కుండలోని చల్లటి నీరు, మజ్జిగ, నిమ్మరసం లాంటివి తీసుకొని ప్రజలు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పలువురు సూచిస్తున్నారు.

## శ్రవణ్ కుమార్ రెడ్డి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

**ప్రజాపక్షం/రామన్నపేట :** తెలంగాణ మలిదశ ఉద్యమంలో చురుకుగా పాల్గొని జైలు జీవితం గడిపి అనంతరం సిరిపురం గ్రామానికి ఉప సర్పంచిగా సేవలందించిన దాసిరెడ్డి శ్రవణ్ కుమార్ రెడ్డి అకాల మరణం తీవ్ర విషాదకరమని తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి రాపోలు నరసింహా అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం 39 సంవత్సరాల వయసులోనే ఆయన మన మధ్యలేకపోవడం సమాజానికి, సిరిపురం గ్రామానికి తీరని లోటని, ప్రజాసేవ పట్ల ఆయనకున్న అంకిత భావం, ఉద్యమ సమయంలోచూపిన ధైర్యం యువతకు ఆదర్శమని, ఇలాంటి వ్యక్తి కుటుంబం నేడు దిక్కుతోచని స్థితిలో ఉండడం మనందరినీ కలచివేస్తోందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి, శ్రవణ్ కుమార్ రెడ్డి కుటుంబానికి ఆర్థిక , సామాజిక భరోసా కల్పించాల్సిన అవసరం ఉంది.

## భువనగిరి నుండి తరలించకుండా చర్యలు తీసుకువాలి



**ప్రజాపక్షం/భువనగిరి** : జిల్లా అదనపు కోర్ట్ ను భువనగిరి నుండి తరలించకుండా చర్యలు తీసుకువాలని బార్ అసోసియేషన్ అధ్యక్షులు నిసంగి విద్యా సాగర్ అన్నారు. భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డిని బార్ అసోసియేషన్ అధ్యక్షులు నిసంగి విద్యా సాగర్ ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్బంగా వారు జిల్లా అదనపు కోర్ట్ విషయం లో భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డికి వివరించారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి కోర్ట్ విషయం లో భువనగిరి పట్టణం నుండి తరలించ కుండా చర్యలు తీసుంటాం అని తెలిపారు. జి.శ్రీనివాస్ రెడ్డి, మేడబోయిన యాదగిరి, శారదా ఉడతా సురేష్, పడాల శ్రీనివాస్, గోదా వెంకటేష్, బొమ్మ వెంకటేష్, బార్ కౌన్సిల్ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.



## ఆర్టిజన్ ఉద్యోగులకు ప్రభుత్వం న్యాయం చేయాలి

ప్రజాపక్షం/కొండమల్లేపల్లి; విద్యుత్ శాఖ లో పనిచేస్తున్న ఆర్టిజన్ ఉద్యోగులకు ఏపిఎస్ఈబి సర్వీస్ రూల్స్ అమలు చేసి వారికి న్యాయం చేయాలని బిఆర్ఎస్ నల్గొండ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్రకుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొండమల్లేపల్లి పట్టణంలోని విద్యుత్ డిఈ కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న ఆర్టిజన్ ఉద్యోగులకు ఆయన శుక్రవారం మద్దతు తెలిపి మాట్లాడారు. ఈకార్యక్రమంలో సిఐటియూ జిల్లా సహాయ కార్యదర్శి నల్ల వెంకటయ్య, యాదగిరి, పర్వతరెడ్డి, ఆర్టిజన్ జేఏసి నాయకులు పాల్గొన్నారు.

## గోశాలకు పండ్లు అందజేత



ప్రజాపక్షం/రామన్నపేట : రామన్నపేట మండల పరిధిలోని ఇంద్రపాలనగరం గ్రామంలో జగద్గురు శ్రీ ఆదిశంకరాచార్య గోశాల యందు మండల కృష్ణ సంధ్యారాణిల పెల్లిరోజు సందర్భంగా గోశాలకు పండ్లను అందజేశారు. గోశాల నిర్వాహకులు నరసింహాస్వామి అఘోర గోవులకు పండ్లను పంపిణీ చేసి ఆహారంగా అం దించనైనది. ఈ సందర్భంగా గోశాల నిర్వాహకులు మాట్లాడుతూ దాతలు ముందుకు వచ్చి సహకరిం చడం వల్ల వారి కుటుంబానికి,వారికి గోమాత ఆశీస్సులు ఎల్లవేళలా ఉంటాయని అన్నారు.

## మహిళలకు వ్యాక్సిన్



ప్రజాపక్షం/తుర్కపల్లి : తుర్కపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డా.రుచిరారెడ్డి అధ్వర్యంలో మహిళలలో గర్భసంచి కాన్సర్ నివారక హుమన్ పాపిలోమా వాక్సిన్ (HPV) 14 సంవత్సరాలు నిండి 15 సం లోపు బాలికలకు ఇచ్చే కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు ఎఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

## 'పోషణ్ పక్వాడ'

ప్రజాపక్షం/నాంపల్లి: మండలంలోని ముష్టిపల్లి, రాజ్య తండా అంగన్వాడి కేంద్రాల్లో గురువారం పోషణ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్లు మంజుల,ప్రసూన తల్లిదండ్రులకు చిరుధాన్యాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.పిల్లల జననం నుండి మూడు సంవత్సరాల వరకు ఉండే కాలాన్ని వెయ్యి రోజుల బంగారు భవిష్యత్తుగా పేర్కొంటూ,ఈ సమయంలో సరైన పోషణ ఎంతో కీలకమని తెలిపారు. ఈకార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది, వైద్యులు,ఆశా వర్కర్లు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాలు అరికట్టేందుకు వినూత్న కార్యక్రమం



ప్రజాపక్షం/మునగాల : పశువుల వల్ల సంభవించే రోడ్డు ప్రమాదాలు అరికట్టడానికి వినూత్నంగా కార్యక్రమం చేపట్టామని మునగాల సర్కిల్ ఇన్స్పెక్టర్ రామకృష్ణారెడ్డి తెలిపారు. వేసవిలో పశువుల వల్ల జరిగే రోడ్డు ప్రమాదాల నివారణకు స్థానికులతో కలిసి మునగాల మండల కేంద్రంలో శుక్రవారం గేదల కొమ్ములకు రెడ్ రేడియం స్టిక్కర్స్ అంటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారి 65పై వేసవి కాలంలో పశువుల వల్ల జరిగే ప్రమాదాలను అరికట్టడంలో కృషి చేస్తున్నామన్నారు. పశువుల వల్ల రాత్రిల్లు అధికంగా రోడ్డు ప్రమాదాలు సంభవించి పశువులు, ప్రయాణికులు మృత్యువాత పడుతున్నారని వీటి నివారణ కోసం రైతులు వారి పశువులకు రేడియం స్టిక్కర్లు వేయించుకోవాలని రాత్రివేళ పశువులని వదలకూడదని తెలిపారు. అనంతరం స్థానికులతో మాట్లాడి రోడ్డు భద్రతా నియమాల పట్ల అవగాహన కల్పించారు. రోడ్లపై ఎక్కడపడితే అక్కడ రోడ్డు దాటకూడదని, తప్పుడు మార్గంలో వ్యవసాయ పనులకు వెళ్లే వాహనాలను నడపకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాములమ్మ, మునగాల సర్కిల్ ఇన్స్పెక్టర్ రామకృష్ణారెడ్డి, స్థానిక ఎస్ఐ ప్రవీణ్ కుమార్, జాతీయ రహదారుల అధికారులు, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

## దళిత క్రైస్తవులకు ఎస్సి హోదా తీర్పు రాజ్యాంగ విరుద్ధం



ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : దళిత క్రైస్తవులకు ఎస్సి హోదా తీర్పు రాజ్యాంగ విరుద్ధమని తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ బిషప్ దుర్గం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని శాంతినగర్ నందు నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సామాజిక వేత్త, ఉద్యమనేత డాక్టర్ పద్మశ్రీ మందకృష్ణ మాదిగను విమర్శిస్తే ఎవ్వరినైనా సహించేది లేదన్నారు. మత, భాషా మైనార్టీలలోని సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల కోసం రిజర్వేషన్లతో సహ సంక్షేమ చర్యలను సిఫార్సు చేయడానికి భారత ప్రభుత్వం 2004లో రంగనాథ్ మిశ్రా జాతీయ కమీషన్ను ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. 2007లో తన నివేదికను సమర్పించిందని ప్రభుత్వ ఉద్యోగాలలో, ఉన్నత విద్యాసంస్థలలో ముస్లీంలకు 10 శాతం, ఇతర మైనార్టీలకు 5 శాతం కోటాను ప్రతిపాదించారన్నారు. మతం మారిన వారికి ఎస్సి హోదా ఇస్లాం లేదా క్రైస్తవ మతంలోకి మారిన దళితులను షెడ్యూల్డ్ కులాల కోటా కింద రిజర్వేషన్ ప్రయోజనాలను హోదాను మతపరంగా తటస్థంగా మార్చాలని సిఫార్సు చేయబడిందన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట అధ్యక్షులు రెవ. డాక్టర్ జలగం జేమ్స్, హుజూర్నగర్ అధ్యక్షులు రెవ. డాక్టర్ మోసా దేవసహాయం, పాస్టర్లు ఉట్కూరి రాజు, పంది మార్క్, ఏర్పుల క్రిస్టోఫర్, కొండేటి లాజర్, ప్రేమ్సాగర్, కత్తుల సుధాకర్, కిరణ్కుమార్ పాల్గొన్నారు.

## స్టాటిస్టిక్స్ సబ్జెక్టుపై విద్యార్థులకు భయాందోళనలు తొలగించాలి



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: స్టాటిస్టిక్స్ సబ్జెక్టు పట్ల విద్యార్థులకు ఉన్న భయాందోళనలను తొలగించడమే అధ్యాపకుల ముఖ్య కర్తవ్యమని విసిటింగ్ ప్రొఫెసర్ సెంటర్ ఫర్ ఎకనామిక్స్ అండ్ సోషల్ స్టడీస్ ఎస్.ఇంద్రకాంత్ అన్నారు. శుక్రవారం స్థానిక కేవీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్థశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బేసిక్ స్టాటిస్టిక్స్ ఇన్ టీచింగ్ ఆఫ్ ఎకనామిక్స్ అనే అంశంపై నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ వర్క్ షాప్ ముగింపు సమావేశంలో ఆయన ప్రొఫెసర్ కృష్ణారెడ్డితో కలిసి పాల్గొని మాట్లాడారు. స్టాటిస్టిక్స్ అనేది స్కూల్ ఎడ్యుకేషన్ నుంచి ఉన్నత విద్య వరకు విద్యార్థులు ప్రత్యేక చొరవ తీసుకోని ఈ సబ్జెక్టును నేర్చుకోవాలని అన్నారు. పూర్వకాలంలో స్టాటిస్టిక్స్ సబ్జెక్టును కొద్ది మంది మాత్రమే చదువుకునే సబ్జెక్టుగా ఉండేదని కాలక్రమంలో స్టాటిస్టిక్స్ సబ్జెక్ట్ అనేది కేవలం మాథ్స్ స్టాటిస్టిక్స్ విద్యార్థులు మాత్రమే కాకుండా సోషల్ స్టడీస్, లిటరేచర్ సైకాలజి ఇలా అన్ని శాస్త్రాల్లో స్టాటిస్టిక్స్ గొప్పగా అభివృద్ధి చెందిన సబ్జెక్ట్గా మారిందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భీమార్జున్రెడ్డి, ప్రొఫెసర్ గుమ్మడి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## సీతారామచంద్రస్వామి 16 రోజుల పండుగ



ప్రజాపక్షం/నకిరేకల్ : మండల పరిధిలోని చందుపట్ల గ్రామంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో శుక్రవారం 16 రోజుల పండుగ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు.ఈసందర్భంగా స్వామివారికి,అమ్మవారికి గ్రామస్తులు,భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయ అర్చకులు స్వామివారికి విశేష అభిషేకాలు, అలంకరణలు చేపట్టారు.అనంతరం హోమాలు, శాంతి పూజలు నిర్వహించారు. భక్తుల కోసం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మేడవరపు యుగంధర్రావు,మాజీ ఆలయ కమిటీ చైర్మన్ కిషన్రావు,సర్పంచ్ దిగోజులతా వెంకటాచారి,ఉపసర్పంచ్ ఒర్సు మంజుల శ్రీను, మేడవరపు నరసింహారావు,మలిగి రెడ్డి రంగారెడ్డి,గోనె నరసింహారావు,కొప్పు సత్తయ్య,మంగినపల్లి వెంకటయ్య గోదాభక్త మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## సిపిఐ ఉద్యమాలకు చేయూతనివ్వండి

ప్రజాపక్షం/నాంపల్లి: మండలంలోని వడ్డేపల్లి,టి.పి.గౌరారం,మల్లపురాజుపల్లి గ్రామాల్లో శుక్రవారం సిపిఐ నిధి సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండల సిపిఐ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి నిధులు సేకరించారు.ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్. అంజయ్య చారి మాట్లాడుతూ సిపిఐ 100 సంవత్సరాలు పూర్తి చేసుకుని పేద ప్రజల కోసం అనేక ఉద్యమాలు నిర్వహించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి స్వజన బోయిన రమేష్,సహాయ కార్యదర్శి నేతాళ్ల రాజు,ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు జనం పాట జగన్,కార్యవర్గ సభ్యులు ఊరుపాక వెంకటయ్య,కోరే సత్తయ్య,ఉప సర్పంచ్ బుషిపాక యాదయ్య ,గొడ్డేటి సత్తయ్య, పల్లేటి దశరథ, వార్డు సభ్యులు గొడ్డేటి రామచంద్రం, వెంకటాచారి పాల్గొన్నారు.

## అనుమానాస్పదంగా యువకుడు మృతి



ప్రజాపక్షం/చివ్వెంల : అనుమానాస్పదంగా యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని ఎంజిన గర్ తండ గ్రామ పంచాయితీ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఎంజిన గర్ తండకు చెందిన ఆనంద్ మంజుల కుమారుడు మనీ భార్గవ్ (22) ఆటో డ్రైవర్గా జీవనం కొనసాగిస్తున్నాడు. గురువారం ఆటో తోలడానికి వెళ్ళిన మనీభార్గవ్ ఎంజినగర్ తండ నుంచి రోళ్ళబండ తండ వెళ్లే దారిలో అనుమానాస్పదంగా మృతి చెంది ఉండడం పట్ల కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. సంఘటన స్థలంలో తాడు, చాకు ఉండడం, మెడ చుట్టూ తాడుతో ఉరివేసిన ఆనవాళ్లు ఉన్నట్లు స్థానికులు, పోలీసులు తెలిపారు. యువకుడి మృతి పట్ల చుట్టుపక్కల తండ ప్రజలు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

## సాదాబైనామా అమలుపై రెవెన్యూ సిబ్బందికి అవగాహన



ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : సాదాబైనామా అమలుపై రెవెన్యూ సిబ్బందికి శుక్రవారం జిల్లా కేంద్రంలో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ డివిజనల్ అధికారి వేణుమాధవ్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా 2020లో ఆన్లైన్ చేయబడిన సాదాబైనామా రైతుల దరఖాస్తులను పూర్తి చేయాలన్నారు. గతంలో భూమి యజమాని నుండి కొనుగోలు చేసిన రైతులు అఫిడవిట్ను ఇవ్వాలని ఉన్న నిబంధనను తొలగించడం జరిగిందన్నారు. కేవలం భూమిని కొనుగోలు చేసిన రైతు స్వయంగా అఫిడవిట్ ఇస్తే సరిపోతుందని చెప్పారు. స్థానిక ఆర్ఐ, సర్వేయర్లు ఆ భూమి వద్దకు వెళ్ళి పరిశీలించి భూమి పక్కన ఉన్న రైతుల ద్వారా పంచనామా చేయాలని సూచించారు. ఈ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేసి పాసుపుస్తకాలు జారీ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్లు కృష్ణయ్య, రాజశేఖర్ రెడ్డి, అమీన్సింగ్, చంద్రశేఖర్, వెంకన్న, శ్రీకాంత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## బడిబాట కార్యక్రమం

ప్రజాపక్షం/రామన్నపేట : మండలంలోని కొమ్మాయిగూడెం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అధ్యాపక బృందం ఆధ్వర్యంలో నిర్వహించినటువంటి జయశంకర్ బడిబాట కార్యక్రమంలో సర్పంచ్ మారేపల్లి మల్లారెడ్డి పాల్గొన్నారు.అనంతరం ప్రభుత్వ పాఠశాలను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలకన్నా ప్రభుత్వ పాఠశాల మిన్న అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మురళి, అధ్యాపక బృందం, ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయులు కోటేశ్వర్, అధ్యాపక బృందం, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.



## రెగ్యులర్ సర్వీస్ రూల్స్ అమలు చేయాలి

**ప్రజాపక్షం/గుండాల;** విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఆర్టిజన్ ఉద్యోగులకు ఏపిఎస్ఈబి సర్వీస్ రూల్స్ అమలు చేసి వారికి న్యాయం న్యాయం చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కేందరలోని డిఈ కార్యాలయం ముందు గత మూడు రోజులు జాయింట్ యాక్షన్ కమిటి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మెలో భాగంగా శుక్రవారం కార్మికులు భారీ ఎత్తున తరలిరావడం జరిగింది. ఈ కార్యక్రమంలో కన్వీనర్ రమేష్, కో కన్వీనర్ వెంకటేష్, పాండర్‌రెడ్డి, రమేష్, భాస్కర్, శ్రీకాంత్, ఆర్టిజన్లు తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/కోదాడ:** వివిధ రంగాలకు చెందిన కార్మికుల సమస్యల పరిష్కరానికి సీఐటీయూ జెండా అండగా నిలుస్తుందని సంఘ జిల్లా అధ్యక్షులు కోటగిరి వెంకటనారాయణ అన్నారు. శుక్రవారం కోదాడ పట్టణ కురగాయాల మార్కెట్‌లో హమాలీ వర్కర్స్ యూనియన్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

## బెల్ట్ షాపులను మూసివేయాలని వినతి



**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం సుద్దాల గ్రామ సర్పంచ్ గడ్డమీది మహోదయ్‌గౌడ్‌కు శుక్రవారం మహిళా సంఘాల సభ్యులు గ్రామంలో బెల్ట్ షాపులను మూసివేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ప్రజా ఆరోగ్యం, కుటుంబాల ఆర్థిక భద్రత దృష్ట్యా బెల్ట్ షాపులను రద్దు చేయాలని మహిళా సంఘాల సభ్యులు డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని మహిళలు హెచ్చరించారు.

## ఫీల్డ్ అసిస్టెంట్‌కు సన్మానం

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** యాదాద్రి జిల్లాలో ఉపాధిహామీ పథకంలో అత్యధిక సంఖ్యలో కూలీల పనివారి అటెండెన్స్ ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా విజయవంతంగా నమోదు చేసిన తుర్కపల్లి మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ గడిపే ఇంద్రయ్యను కలెక్టరేట్‌లో అడిషనల్ డిఆర్డీఓ సురేష్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీలో మరింత కృషితో సేవలు చేసి ఉన్నత స్థాయికి రావాలని అధికారులు, తుర్కపల్లి మండల ఎంపీడీఓ గీతారెడ్డి, ఇంద్రయ్యను అభినందించారు.




# బట్టు మహేందర్‌కి అన్ని విధాలుగా అండగా ఉంటాం



**ప్రజాపక్షం/భువనగిరి :** బట్టు మహేందర్‌కి అన్ని విధాలుగా అండగా ఉంటాం అని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. 22వ వార్డుకి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు బట్టు మహేందర్ కి బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో ఘట్కేసర్ లోని నీలిమ హాస్పటల్ లో చికిత్స పొందుతున్నాడని స్థానిక కౌన్సిలర్ జాలిగం విఘ్నేష్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో శుక్రవారం హాస్పటల్‌కి వెళ్లి మహేందర్ ఆరోగ్య పరిస్థితిని వాకబు చేసి వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హాస్పటల్ చైర్మన్ తో ఫోన్లో మాట్లాడి మెరుగైన వైద్య అందించాలని వైద్య ఖర్చులు సైతం తానే చూసుకుంటానని చెప్పి తెలిపారు. వారి కుటుంబానికి కూడా అన్ని విధాలుగా ఆదుకుంటానని భరోసా కల్పించారు. తొందరగా ఆరోగ్యం మెరుగుపడెలా చూడాలని డాక్టర్లను కోరడం జరిగింది. ఆయన వెంట స్థానిక 22వ వార్డు కౌన్సిలర్ జాలిగం విఘ్నేష్, పిసిసి డెలిగేట్ మెంబర్ తంగళ్లపల్లి రవికుమార్, నాయకులు కుక్కదువు సోమయ్య, షఫీక్ అహ్మద్, బేండే లాలరాజ్, ఈరపాక నర్సింహా, సయ్యద్ ముల్తానిష, బిక్షపతి, మనీష్ తదితరులు ఉన్నారు.

# రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం





**ప్రజాపక్షం/నకిరేకల్ :** రైతులు మధ్య దళారీలను ఆశ్రయించకుండా ప్రభుత్వ నిర్ణయించిన మద్దతు ధరకే కొనుగోలు కేంద్రాలలో తమ ధాన్యాన్ని అమ్ముకోవాలని మార్కెట్ కమిటీ చైర్మన్ గుత్తా మంజుల మాధవరెడ్డి పేర్కొన్నారు.శుక్రవారం మండలంలోని కడపర్తి ఒగోడు గ్రామాలలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నకిరేకంటి ఏసు పాదం,పిఎసిఎస్ మాజీ చైర్మన్ మాది ఎల్లేష్,ఒగోడు,నడిగూడెం ఉపసర్పంచ్‌లు పులి రేవతి లింగయ్య,రాచకొండ భాస్కర్ పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/నాంపల్లి:** రైతులు తాము పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మి నష్టపోవద్దని తహసీల్దార్ దేవా సింగ్, నాంపల్లి గ్రామ సర్పంచ్ నక్క చంద్రశేఖర్ సూచించారు.మండలంలోని మెల్లవాయి, నాంపల్లి పట్టణ కేంద్రాల్లో ఐకెపి ఆధ్వర్యంలో శుక్రవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. రైతులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మహిళా సంఘ సభ్యులు,సంఘ బంధం సభ్యులు, రైతులు ఇతరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** రైతుల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని, మండలంలో రైతులకు అందుబాటులో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి, మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ తూముల భుజంగరావు అన్నారు. మండలంలోని అనంతారం, సింగారెడ్డిపాలెం, మహ్మదాపురం, పెన్‌పహాడ్ గ్రామాలలో ఐకెపి, పిఏసిఎస్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను డిసిఓ ప్రవీణ్ కుమార్, తహశీల్దార్ గుమ్మి రాజశేఖర్ రెడ్డి, పిఐసి ఆనంద్‌లతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఓ అనిల్ కుమార్, మాజీ చైర్మన్ నాతాల జానకిరాంరెడ్డి, సిఈఓలు ఆలకుంట్ల సైదులు, సోమ్లా నాయక్, ఏఈఓ శ్రావణి, ఆయా గ్రామాల సర్పంచులు మామిడి శోభ శ్రీనివాస్, ఒగ్గు కిరణ్, కొండేటి మౌనిక పవన్ పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/చివ్వెంల :** రైతు సంక్షేమమే మా నినాదం, అన్నదాత అభ్యున్నతే మా విధానం అని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఉండ్రుగొండ గ్రామంలో ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. చెమట చిందించే కర్షకుడికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లవేళలా బరోసానిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు ధరావత్ వీరన్న నాయక్, గుడిసె రామకృష్ణ, ఉపసర్పంచ్ పల్లేటి వీరమ్మ, మెడబోయిన నాగరాజు, అంజద్ అలీ, చింతమళ్ల రమేష్ పాల్గొన్నారు.



# ఉపాధి కూలీ మహిళను వేధింపుపై కేసునమోదు



**ప్రజాపక్షం/అడ్డగూడూరు :** మండల పరిధిలోని గట్టసింగారం గ్రామానికి చెందిన ఉపాధి హామీ తాత్కాలిక ఫీల్ అసిస్టెంట్ ఈదుల రమేష్ తండ్రి బిక్షం అను అతను ఉపాధి హామీ పనిచేయడానికి వచ్చే మహిళను అసభ్యకరంగా వేధిస్తూ లైంగిక కోరిక తీర్చమని వెంటపడుతూ, లేనిచో పనిలో ఆటంకం కల్పిస్తానని, గతంలో ఆమెతో మాట్లాడిన వాట్సప్ వీడియో కాలింగ్ ని బయట పెడతానని బెదిరిస్తూ గురువారం రోజున ఆ మహిళతో గతంలో వీడియో కాల్ మాట్లాడిన స్కీన్ షాట్‌ను ఇన్స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసి, వాట్సప్ డీపీగా పెట్టినాడు అట్టి విషయంపై ఆ మహిళ ఫిర్యాదు మేరకు అడ్డగూడూరు ఎస్ఐ వెంకటరెడ్డి కేసు రిజిస్టర్ చేసి దర్యాప్తు చేస్తున్నామని మీడియాకు తెలిపారు.

## జ్యోతిరావుపూలే 199వ జయంతి ఉత్సవ కమిటీ కోకన్వీనర్‌గా లింగంగౌడ్



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రతి సంవత్సరం ఏప్రిల్ 11న రాష్ట్ర ప్రభుత్వం హైద్రాబాద్‌లోని రవీంద్రభారతిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే సంఘ సంస్కర్త, సామాజిక విప్లవకారుడు, మహాత్మ జ్యోతిరావుపూలే జయంతి ఉత్సవ కమిటీ కోకన్వీనర్‌గా బీసీ సంఘం రాష్ట్ర నాయకుల జాజుల లింగంగౌడ్ నియామకమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తనను ఉత్సవ కమిటీ కోకన్వీనర్‌గా నియమించడం పట్ల సీఎం రేవంత్‌రెడ్డికి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కి, ఉత్సవ కమిటీ ఛైర్మన్ వి.హనుమంతరావుకి, బీసీ జేఏసీ ఛైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్‌లకు ధన్యవాదాలు తెలిపారు.

## చిన్నారికి ఆర్థిక సాయం



**ప్రజాపక్షం/దేవరకొండ;** దేవరకొండ పట్టణంలోని జంగాల కాలనీకి చెందిన దువ్వ ప్రవీణ్‌కుమార్ కూతురు దువ్వ భావన (5) గత 15 రోజుల క్రితం ఆపేండెక్స్ నిర్వహించారు. కడుపులో ఇన్ఫెక్షన్ అవ్వడం ఖర్చుతో కూడకున్న వైద్యం అవసరమవడంతో శుక్రవారం భావన తండ్రి ప్రవీణ్‌కుమార్ జాలే నర్సింహారెడ్డిని సహాయం కొరగా వెంటనే స్పందించిన నర్సింహారెడ్డి రూ. 10వేల లను అందజేయడం జరిగింది. ఆపదలో ఆదుకున్న జాలే నర్సింహారెడ్డికి ప్రవీణ్‌కుటుంబ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## రూ.20వేల ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలో అర్హులైన వారు జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద ఇంటి యజమాని చనిపోయినట్లయితే వారి కుటుంబానికి రూ.20వేల ఆర్థిక సహాయం కేంద్ర ప్రభుత్వం అందిస్తుందని ఇందుకు ఈనెల 14వరకు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమీషనర్ జి.శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ విషయం పట్టణంలోని స్వయం సహాయక సంఘాల మహిళలు గాని భవన కార్మికులు గాని, ఇతర పనిచేసే కూలీలు గాని,రైస్ మిల్లు గుమస్తాలు గాని శానిటేషన్ సిబ్బంది గాని తెల్లరేషన్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరు కూడా ఇంటి యజమాని చనిపోయినట్లయితే మీసేవలో 14వరకు అప్లికేషన్ పెట్టుకోవాలన్నారు.

## చిరు వ్యాపారులకు గొడుగుల పంపిణీ



**ప్రజాపక్షం/చండూరు:** లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ జీఎంటి కోఆర్డినేటర్ ఎంజెఫ్ లయన్ గుడిపుడి వెంకటేశ్వరావు సహకారంతో శుక్రవారం లయన్స్ క్లబ్ ఆఫ్ చండూరు ఆధ్వర్యంలో చండూరు మున్సిపాలిటీ పరిధిలో రోడ్డు పై ఎండలో చిరువ్యాపారం చేసుకునే వ్యాపారస్తులకు గొడుగులను పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ ఆఫ్ చండూరు అధ్యక్షుడు లయన్ ఏనుగు వెంకట్‌రెడ్డి, కోశాధికారి లయన్ లవకుమార్ , ఫాస్ట్ ప్రెసిడెంట్ ఎంజెఎఫ్ లయన్ కొత్తపాటి సతీష్ ,ఫాస్ట్ ప్రెసిడెంట్ సంగు జానయ్య, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## ఆరోగ్యలక్ష్మి చైర్‌పర్సన్‌గా కొండ సైదమ్మ

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** మండల కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్ 3 ఆరోగ్యలక్ష్మి కమిటి చైర్‌పర్సన్‌గా కొండ సైదమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అంగన్‌వాడీ టీచర్ ఊర్మిళాదేవి ఆధ్వర్యంలో ఈ ఎన్నిక ప్రక్రియ నిర్వహించారు.